# 3. బహుళరాగం

బయట సన్నగా వర్షం కురుస్తోంది. లోపల వాతావరణం గంభీరంగా వుంది.

చూరుకేసి చూస్తూ పెదవి విప్పాడు, సీతారావుడు, "వాస్తవం చెప్పకుండా దాచిపెట్టి పిల్లగొంతు కోశారు. పెనంమీది గింజలా అయిపోయింది దాని బతుకు"

మోకాలిమీద తలవంచుకుని ఏడుస్తూ కూచునుంది కమల. ఉండుండోసారి ముక్కు చీదుకుంటోంది . ఆమే సీతారావుడి ఒక్కగా నొక్క కూతురు.

"దీని మొగుడికి ఎప్పుడో పెళ్లయిపోయిందిట. ఆ మొదటి పెళ్లానికి పిల్లలు పుట్టేది లేదని ఈ పన్జేయించారట"–కమల తల్లి కృష్ణవేణి. పక్కగా గోడనానుకుని నిల్చుని వుందామె. "నిండా ఆర్నెల్లు కాకపోయె. పుట్టెడు దుః ఖంతో పుట్టింటికొచ్చేసింది పిల్ల. ఏం జేసేట్టు?"

"సంబంధాలకోసం ఆ తూర్పు దేశం పోవద్దురా అని నువ్వంటే, వినకపోవటం తప్పయిపోయింది బాబాయ్. మధ్యవర్తుల మాట విని మోసపోయాం. ఆస్తిపాస్తులు చూశాంగానీ వాళ్ల గుణగణాలు చూడలేదు. కాని కష్టాలు కొని తెచ్చుకొన్నాం" – సీతారావుడు.

తలెత్తి ముగ్గుర్నీ చూశాడు జగన్నాథం. సీతారావుడూ కృష్ణవేణీ ఏవో సైగలు చేసుకుంటున్నారు.

క్షణాల తర్వాత అన్నది కృష్ణవేణి, "నీతీజాతీ లేని కొంపలైపోయినై. తిరిగి ఆ వూరు పోనంటోంది కమల".

"మాకున్న పెద్దదిక్కు నువ్వొక్కడివే ఏవంటావ్ బాబాయ్?"

జగన్నాథంకి ఊళ్లో పెద్ద వ్యవహర్త అని పేరు. అరవై అయిదేళ్ల వయస్సు. జీవితంలో ఢక్కా మొక్కాలు తిన్న అనుభవం. పిల్లాజెల్లా లేకపోయినా,

ఆయనపట్లా, ఆయన భార్య సుగుణమ్మ పట్లా, అందరికీ గౌరవభావం ఎక్కువ. ఊరి మంచికి పాటు పడే వ్యక్తిగా పదవుల్లో వున్న వాళ్లు కూడా జగన్నాథం సలహాలూ, సంప్రదింపులూ తీసుకుంటూ వుంటారు. ఇప్పుడు అన్నకొడుకు సీతారావుడు కూడా ఆయన సలహా కోరి వచ్చాడు.

నిముషాలపాటు ఆలోచించాడు జగన్నాథం. వెంటనే సమాధానమేం దొరకలేదు. నింపాదిగా సలహాకోసం వచ్చారు. అన్నాడు, "కొన్నాళ్లు కానీండి. ఎట్టా జరుగుతుందో చూద్దాం. వాళ్లూ నోళ్లు కట్టేసుక్కూర్చోరుగా"

మాటలు సాగుతున్నై. ఉన్నట్టుండి లేచి నిలబడింది కమల. బెక్కుబెక్కున ఏడ్చింది.

"ఆ...ఆ...వాళ్ళేం మన కాడికి రారు. మాట్లాడరు. ఆయన సుకానికి ఇప్పుడేం లోటుంది కనకా?" అంటూ బెరుకుబెరుగ్గా వంటింటి వైపు కదిలింది.

గడపదగ్గరే నిలుచుని వుంది నాయనమ్మ-సుగుణమ్మ. రోగిష్టి ఆకారం. మొహాన్నమాత్రం పసిమి కాంతి. వీసమెత్తు చెన్ను దరగని ప్రశాంతత. ఆయాసం మాత్రం వద్దన్నా గుండెల్ని పైపైకి ఎగసిపడేస్తోంది. చూసేవారికి ఆమె మూగబాధ తెలుస్తూనే వుంది. పూలమొక్కని ఆహ్వానిస్తున్న చల్లని గాలిలా కమలని దగ్గరకి తీసుకుంది సుగుణమ్మ. ఆ పిల్ల చేతిని తన చేతిలోకి తీసుకుని "పిచ్చిపిల్ల. ఏం ఫర్వాలేదు. ఊరుకో" అంటూ చేత్తో బుజం నిమురుతూ లోపలికి తీసుకుపోయింది.

ఈదురుగాలి తెర వొకటి వర్షం తుంపరని చెళ్లున లోపలికి కొట్టింది. దబ్బున కిటికీ రెక్కలు మూసింది సుగుణమ్మ. వసారాలోని ముగ్గురూ కమల సంసారం గురించి మాట్లాడుకుంటూనే వున్నారు. లోపల సుగుణమ్మ గ్లాసులో మజ్జిగపోసి కమల చేతికిస్తోంది.

నెలలు గడుస్తున్నై.

కమల కాకినాడలో అత్తింటికి తిరిగి వెళ్లి చాలారోజులైంది. ఆమె నీళ్లోసుకుందనే వార్తా చేరింది జగన్నాథం దంపతులకి. ఆ తర్వాత చూలింత వేడుకలూ, బాలింత ముచ్చట్లూ, బారసాల మురిపాలూ ఘనంగానే జరిగిపోయినై!

❖ ❖ ❖

పగలు పదకొండుగంటలవుతోంది.

బర్మాటేకు వాలు కుర్చీలో మహాభారతం చదువుకుంటున్నాడు జగన్నాథం. మనుషుల వ్యక్తిత్వాలు, స్వభావాలూ, మనస్తత్వాలు-ఎన్నెన్ని వైరుధ్యాలతో ఉన్నాయో ఆలోచిస్తున్నాడు. గోడవారగా కొంగుపరుచుకుని, పిట్టలా ముడుచుకుపోయి పడుకుని వుంది సుగుణమ్మ.

అప్పుడు దిగాడు సీతారావుడు. ఆయన కొడుకు రామ్మోహనరావు పెళ్లి. పత్రిక ఇచ్చి విశేషాలు పంచుకున్నాడు.

భోజనాల తర్వాత వెళ్ళిపోయాడు. కమల గురించీ ఆమె సంసారం గురించీ సీతారావుడు ఏ ప్రసక్తీ తేలేదు. వీళ్లూ ప్రత్యేకించి మాట్లాడింది లేదు.

❖ ❖ ❖

పెళ్లికి విజయవాడ వెళ్లారు జగన్నాథం దంపతులు. అర్ధరాత్రి పెళ్లి.

ఇప్పుడు రాత్రి ఎనిమిదయింది. కల్యాణమంటపంలో లోకాభిరామాయణం నడుస్తోంది.

పెళ్లికొడుకు మిత్రులు నలుగురైదుగురు బెంగుళూరు నుంచీ వచ్చారు. ఎవరిగురించో వారిలో వారు చర్చించుకుంటున్నారు. జగన్నాథం పక్క కుర్చీల్లోనే వున్నారు వారంతా.

"మన ప్రశాంత్ బంగారంలాంటి కుర్రాడు. మోసపోయాడు. పెళ్లయి ఆర్నెల్లు కాలేదు. పెళ్లాం 'ఎఫైర్' బయటపడిందంట. ఆమెని నిలదీస్తే 'అవును నిజమే" అనటమే కాక, విడాకులు కావాలంటోందిట. అలాంటి గర్ల్‌కి మేరేజ్ బ్యూరోలో రిజిస్ట్రేషన్‌లు ఎందుకో అసలు?" "తల్లిదండ్రులకి ఆమె చెప్పలేదో లేక తమ ప్రయత్నాల్ని వాళ్ళు ఈమెకి చెప్పలేదో?" "అయినా చివరికి పెళ్లి పీటల మీద కూర్చుంది ఆమేగా" "ఏది ఏమైతేనేం, వీడు ఏడుస్తున్నాడు" ఇదీ చర్చ. వింటున్నాడు జగన్నాథం.

"అయినా ఇలాంటి వాటిని పెద్ద యిష్యూ చెయ్యకూడదు" ఎవరిదో మరో అభిప్రాయం.

డిన్నర్‌కి పిలుపొచ్చింది. అతిథులంతా కదులుతున్నారు. ఉలిక్కిపడి తెప్పరిల్లాడు జగన్నాథం. బుర్రలో ఆలోచనలు గిరికీలు తిరుగుతున్నాయ్. కమల వ్యవహారంలో భర్తకి ఆమెతో పెళ్లికిముందు 'ఎఫైర్'. ఇక్కడ భార్యకి పెళ్లికి ముందు మరో పురుషుడితో 'ఎఫైర్'!

"పరిస్థితులు తలచుకుంటే చాలా దారుణం అనిపిస్తున్నాయ్" ఎవరో అంటున్నారు. "చెప్పింది వినండోయ్ ఫోక్స్! ఆలోచించకండి. అదే ఆరోగ్యానికి మంచిది" మరొకరెవరో జోక్ చేశారు. నవ్వుకుంటూ వెళ్లి పోయారా యువకులు. జగన్నాథమూ లేచి భారంగా కదిలాడు.

–వీళ్లు విజయవాడ నుంచీ తిరిగి వచ్చిన నాలుగోరోజునే ఒక వార్త వచ్చింది.

"నారాయణ మళ్ళీ పెళ్లి చేసుకున్నాడు".

"నారాయణ సుగుణమ్మకి తమ్ముడి వరస. నెల్లూరులో ప్రభుత్వోద్యోగి. ఏడెనిమిది నెలల క్రితం అతనికి భార్య పోయింది. ఆమెకి నిండా నలభైయేళ్లు లేవు. హార్ట్ ఎటాక్ అన్నారు. సంతానం కూనాగుజ్జూ - ఒక మగపిల్లవాడు, ఇద్దరు ఆడపిల్లలు. 'ఆడ దక్షతలేకుండా వీళ్లని సాకటం ఎవరివల్లనవుతుంది. మంచి పని చేశాడు' అన్నది సుగుణమ్మ. వేదాంతిలా నవ్వి వూరుకున్నాడు జగన్నాథం.

అన్ని సంభవాల్నీ పాతబడేస్తూ కాలం ముందుకు పోతోంది.

ఆ రోజు –

అంబటి పొద్దుదాటుతుండగా వచ్చాడు–కరణంగారబ్బాయి సుబ్బారావ్. తల్లిదండ్రులు పోయిన తర్వాత ఆ కుటుంబం ఎప్పుడో గ్రామం వదిలి వెళ్లిపోయింది. సుబ్బారావ్ ఇప్పుడు పొన్నూరులో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. పాత అనుబంధాలూ, చనువూ నిలిచి వున్నై. జగన్నాథంని ఆరోజుల్లో బాబాయ్, బాబాయ్ అంటూ చుట్టుకు చుట్టుకు తిరిగే అలవాటు సుబ్బారావ్‌కి.

కాఫీలయినై. పరామర్శలూ అయినై.

"మా వసంతకి సంబంధం చూశాం మావయ్యా" – సుబ్బారావ్ చెప్పాడు.

ఆశ్చర్యంగా చూపు కలిపాడు జనగన్నాథం. కాఫీగ్లాసులు తీసుకుపోబోతూ

"అవును బాబాయ్, అన్నీ ఆలోచించి ఈ నిర్ణయానికొచ్చాం. వసంత కూడా సరేనని తలవూపింది"

"మంచిది నాయనా" అంది సుగుణమ్మ. మాట కొంచెం ఆయాసంగానే వచ్చింది.

"కుర్రాడు బుద్ధిమంతుడు. మా కాలేజీలోనే ఎకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. మన పరిస్థితులూ, వసంత వివరాలూ తెలిసిన మనిషి. తల్లి వుంది. తండ్రి లేడు. ఏ బాదరబందీ లేనివాడు".

"బాగుంది" అన్నాడు జగన్నాథం.

"కాకుంటే. కాలికి కాస్త పోలియో వుంది. వసంతంటే ఇష్టపడ్డాడు. వసంతా అభ్యంతరం లేదంది. దీనికిప్పుడు ఇరవై నాలుగేళ్లు. మన ఛాదస్తాలతో దాని బతుకుని బండలు చెయ్యడమెందుకని భావించాం-నేనూ, మీ కోడలూ. మీ చెవిని వేసి పోదామని వచ్చాను. ఇంకా మంచిరోజులూ అవీ చూడలేదు"

"మంచిపని చేస్తున్నావ్ సుబ్బారావ్. బాగుంది" అంటూ లోపలికి వెళ్లింది సుగుణమ్మ.

జగన్నాథం కళ్లముందు వసంత నిలిచింది. ఆమె సుబ్బారావ్ పెద్దకూతురు. డిగ్రీదాకా చదివింది. హైదరాబాద్‌లో ఒక కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ని చూసి పెళ్లి చేశారు. పెళ్లయిన ఆరు నెలల్లోనే స్కూటర్ ప్రమాదంలో మరణించాడు వసంత భర్త. తెలతెలవారుతుండగా ఎవరో మిత్రుడికి సెండాఫ్ ఇవ్వటానికి వెళ్లిన వాడికి విధి తానే సెండాఫ్ ఇచ్చింది. పుట్టెడు దుఃఖం, కడివెడు కన్నీళ్లు మిగిలాయి.

మూడేళ్లు గిర్రున తిరిగాయి. ఈలోగా సుబ్బారావ్ మిగిలిన ఇద్దరు కూతుళ్ల పెళ్ళిళ్లూ చేసేశాడు. ఇప్పుడు ఇదిగో ఈ పరిణామం.

మరికొద్దిసేపు పెళ్లి విషయాలే మాట్లాడి సెలవు తీసుకున్నాడు సుబ్బారావ్. చెమ్మగిల్లిన కళ్లను పైపంచెతో వొత్తుకుని లేచాడు జగన్నాథం.

మళ్ళీ వర్షాకాలం వచ్చింది.

సుగుణమ్మకి దగ్గూ ఆయాసం ఎక్కువయినాయి. అయినా ఇంటి పనిపాటలు చేసుకుంటూ మామూలుగానే తిరుగుతోంది. ఉన్నట్టుండి ఒక రోజు సాయంత్రం పెరట్లో పొగడచెట్టు కింద ఒళ్ళు విరుచుకొని పడిపోయింది. నోట మాట పోయింది. కుడికాలూ, ఎడమచేయీ పడిపోయాయి. స్పృహకూడా అంతంత మాత్రంగా మిగిలింది.

గంట తర్వాత తాను పిలుస్తున్న పిలుపుకు బదులు రాలేదని జగన్నాథం లోపలికీ, వెలుపలికీ పోయి వెదికి చూస్తే ఇదీ దృశ్యం. తీసుకువెళ్ళి హాస్పటల్‌లో జాయిన్ చేశాడు. ఆమెకు అన్నీ మంచంలోనే. వచ్చేవారు వచ్చారు. వెళ్లేవారు వెళ్లారు. సానుభూతి బాగానే కురిసింది. డాక్టర్లూ తమ ప్రయత్నం తాము చేశారు.

కడకు పదహారో రోజున, అసురసంధ్యవేళ -సుగుణమ్మ హంస లేచిపోయింది.

భార్య చేతిని తన చేతుల్లోకి తీసుకుని "నన్ను అన్యాయం చేస్తావుటే" అని మూగగా రోదించాడు జగన్నాథం

ఆ క్షణాన్న జగన్నాథంకు రుద్ధమైన కంఠం, ఆ స్వరం – ఆ స్థితిలోనే నిలబడిపోయాయి. రవ్వంత గళం, మోపెడన్ని సైగలూ మిగిలాయి.

ఈ దుర్ఘటనతో మంచమెక్కాడు జగన్నాథం. సుగరూ, బీపీ వచ్చాయి. కృష్ణవేణితో వచ్చాడు సీతారావుడు. 'ఇట్టా అయితే ఎట్టా బాబాయ్' అన్నాడు. తనతో రమ్మన్నాడు. రాలేనన్నాడు జగన్నాథం. తోడు అనివార్యమైంది. తనకు తెలిసిన వారి ద్వారా సుశీలమ్మని పిలిపించాడు సీతారావుడు. ఆమెకు ఏ బాదరబందీ లేదు. పాతికేళ్ల క్రితమే భర్త పోయాడు. అక్కడక్కడా, ఇక్కడా వంటలు చేసుకుని బతుకీడుస్తున్న ఆడమనిషి. ఇప్పుడిక ఇంటిపనులూ, వంటపనులూ అన్నీ ఆమే చూసుకుంటోంది.

సాఫీగా సాగమంటే గతుకుల్లో పోతానంటుంది బతుకు బండి.

జగన్నాథాన్నీ, సుశీలమ్మనీ చూసి ఊరు ఊరుకోలేదు.

"పదిమందికి చెప్పాల్సిన పెద్దమనిషి. ఇదేం బాగాలేదు" అని గుసగుసలు పోవటం మొదలెట్టింది.

మూణ్ణెల్లు తిరిగే సరికీ ఊరి జనానికి జగన్నాథం గురించిన ధ్యాసా, ఆలోచనా, శ్రద్ధా ఎక్కువైపోయినై. 'కావు కావు'లు కావలసిన వారికీ , అక్కర్లేని వారికీ కూడా సమానంగానే వినిపిస్తాయి కదా. జగన్నాథంకి తెలియనిదేమీ లేదు. ఆలోచించాడు. ఒక నిర్ణయం తీసుకోవలసిందే అనుకున్నాడు. సుశీలమ్మనీ సంప్రదించాడు. సమాధానాన్ని చెప్పకయే చెప్పిందామె. చెమ్మగిల్లిన కళ్లతో, వణికే పెదవులతో "భగవదేచ్ఛ" అన్నది. గాలిలో దేవుడికి దణ్ణం పెట్టుకుంది.

ఒక్కపూట పనితో ఆ తంతు పూర్తయింది. జగన్నాథం-సుశీలమ్మల పెళ్లి రిజిష్టరైంది. సాక్షిగా తానూ సంతకం చేశాడు సీతారావుడు.

* * *

బయట వానకురుస్తోంది.

వసారాలో కూర్చుని దిన పత్రిక చదువుతున్నాడు జగన్నాథం.

"యుక్తవయస్కులైన స్త్రీ పురుషులు కలిసి జీవించాలనుకోవడంలో తప్పేమిటి? అది నేరమవుతుందా?"...కలిసి జీవించడాన్నీ, అలాగే పెళ్లికి ముందు సెక్స్ సంబంధం కలిగి ఉండడాన్నీ అడ్డుకునే చట్టం ఏదీ లేదని కోర్టు అభిప్రాయాలూ ఉన్నాయి పేపర్లో. వాటినీ చదివాడు. దీన్ని అంగీకరిస్తే సమాజంలో అస్తవ్యస్త పరిస్థితులూ, విషపోకడలూ ప్రబలుతాయనీ, కోర్టు వ్యాఖ్యలు ధర్మ విరుద్ధమనీ వార్తాకథనం సాగింది. ఆ కథనాన్నీ చదివాడు.

జగన్నాథం మనసు లోలోపల తర్జన భర్జన. అశాంతి. ఆలోచన. తన జీవితంలో-ప్రత్యేకించి ఇటీవలి కాలంలోనే-సంభవించిన సంఘటనలన్నీ బొమ్మలుగా కళ్ళలో మెదిలాయి.

భర్తకి ఒక భార్య వుండగా రెండో భార్యగా కాపరం చేస్తున్న కమల;

పెళ్లికి ముందే 'ఎఫైర్' వుండీ, తెలిసీ, మరొకరిని పెళ్లి చేసుకుని కొన్నాళ్లు కాపరం చేసి, విడాకులు అడుగుతున్న యువతి;

భార్య మరణం వలన రెండో పెళ్లి చేసుకున్న ముగ్గురు పిల్లల తండ్రి-నారాయణ;

ఆర్నెల్ల వైవాహిక జీవితం తర్వాత భర్తని కోల్పోయి మళ్లీ పెళ్లి చేసుకున్న వసంత;

వృద్ధాప్యంలో 'ఆసరా' కోసం సుశీలమ్మని స్వీకరించిన తాను;

ఏది నైతికత? ఏది అనైతికత? ధర్మం, చట్టం, న్యాయం-అవన్నీ తీర్థం తీర్థం, ప్రసాదం ప్రసాదం బాపతా? ఏ సంభవానికి సాంఘిక నియమాలూ, నియంత్రణలూ వర్తిస్తాయి? దేనికి వర్తించవు? అసలు సంఘం వ్యక్తిని శాసిస్తున్నదా; వ్యక్తి సంఘ పరిణామాన్ని ప్రోదిచేస్తున్నాడా? వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, జీవించే హక్కు- అన్నీ చర్చనీయాంశాలే. అయితే, సంస్కారం, శిక్షణా, నడవడిక సంగతేమిటి? మనిషి అంతఃకరణా, పాటించదలచిన విలువలు-ఇవి ఎక్కడ? ఏ విలువల గురించి ఆలోచించాలి? నిజానికి ఇన్ని విషయాలూ- 'అవసరం' ముందు, 'పరిస్థితుల' ముందు గాలికి పోయే పేలపిండి తంతు కాదనగలమా?

ఆలోచించిన కొద్దీ - అన్నీ తెలిసీ, ఏమీ తెలియనట్లుంది జగన్నాథంకి. మనస్సు ఉద్విగ్నమైంది. కళ్లు మూసుకుని, కుర్చీలో వెనక్కి వాలి పడుకున్నాడు.

అప్పుడే చేతిలోని గొడుగు ముడుచుకుంటూ లోపలికొచ్చాడు సుబ్బారావ్.

కుశల ప్రశ్నల తర్వాత 'ఇది చదివావా?' అంటూ దినపత్రికని ఆయనకిచ్చాడు జగన్నాథం. పేపర్ చూడకుండా పక్కన పెట్టాడు సుబ్బారావ్. క్షణం సేపు మాట్లాడడానికి తటపటాయిస్తూ, ఆ తరువాత నెమ్మదిగా పెదవి విప్పాడు.

'పెద్ద సమస్యొచ్చిపడింది బాబాయ్. పదే పదే మొదటి మొగుడి చర్యల్నే కెలికే శాడిస్టయ్యాట్ట-వసంత మొగుడు. ఆ దుర్మార్గుడితో ఇంక వేగలేను. కాపరం చెయ్యలేనని పుట్టింటికొచ్చి కూర్చుంది. కాకి బంగారపు నగలా తయారయ్యింది బతుకు. తలచుకుంటే మనం చేసే పనులకి మనకే అసహ్యమేస్తోంది. ఏం చేయాలో

నాకేమీ అర్థం కావటం లేదు. బతుకులో అఖాతం లాంటి 'వెలితి' మిగిలింది" అని తలవంచుక్కూచున్నాడు.

జగన్నాథం దిగ్భ్రమకి లోనయ్యాడు. శతసహస్ర నియమాలమధ్య, అనంతకోటి ధర్మ పన్నాల మధ్య– 'మనిషి' గుండె లోలోపలి ఈ 'అసహ్యాన్ని', ఈ 'వెలితి'ని ఎలా దూరంగా పెట్టాలి? వీటిని ఎలా తప్పించుకోవాలి??

జవాబులేని ప్రశ్నలు!

జగన్నాథమూ, సుబ్బారావూ ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ ఆలోచనల్లో మిగిలిపోయారు.

బయట వాన జోరు హెచ్చింది!

❖